
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 27 । జూలై । 2023



సోమశిలలో 24.49 టీఎంసీలు

చేజర్ల (సోమశిల): సోమశిల జలాశయంలో బుధవారానికి 24.492 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 3,246 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.61,490
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,522
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,688
నవర (8 గ్రాములు)	రూ.45,504

గరిష్టం/కనిష్టం
29.0 /26.0

వాతావరణం

వాతావరణంలో తేమ 84 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు వర్షం గురువారం కురుస్తుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఉపాధి కూలీలకు రూ.260 అందాలి



మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు(పొగతోట): ఉపాధి పనులకు హాజరయ్యే కూలీలకు రోజూ రూ.260 వేతనం తగ్గకుండా చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి మండలాధికారులు, సిబ్బందితో బుధవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. కూలీలకు రూ.260కు మించి వేతనం మంజూరయ్యేలా పనులను కల్పించాలని చెప్పారు. ఉపాధి పనుల కల్పనలో రాష్ట్రంలో జిల్లా రెండో స్థానంలో ఉందని, వర్షాలు తగ్గాక ప్రత్యేక శ్రద్ధ చూపితే ప్రథమ స్థానంలో నిలవొచ్చని పేర్కొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని సూచించారు.

జెడ్పీలో పదోన్నతులు



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో చైర్‌పర్సన్ అరుణమ్మ, సీఈఓ చిరంజీవి

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలోని మండల పరిషత్, ఇంజినీరింగ్ కార్యాలయాల్లో పనిచేస్తున్న నలుగురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించి బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి జెడ్పీ కార్యాలయంలో అందజేశారు. దుత్తలూరు ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ సహాయకుడిగా పనిచేస్తున్న బి శ్రీధర్‌కు పదోన్నతి కల్పించి కలువాయికి బదిలీ చేశారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డికి పదోన్నతి కల్పించి చేజర్లకు, కావలి పీఆర్ సబ్ డివిజన్ కార్యాలయంలో పనిచేస్తున్న అబ్దుల్ రవూఫ్‌ను వాకాడుకు, బోగోలు ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తున్న రాధికకు పదోన్నతి కల్పించి అల్లూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ చేశారు.

నెల్లూరు డీసీసీబీకి రెండు అవార్డులు



అవార్డులను అందుకుంటున్న డీసీసీబీ సీఈఓ శంకర్‌బాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 2023–24 సంవత్సరానికి నాబార్డు ప్రకటించిన అవార్డులలో నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రెండు అవార్డులను సొంతం చేసుకుంది. నాబార్డు ఆధ్వర్యంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అధ్యక్షతన మంగళవారం విజయవాడలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. సాంకేతిక స్వీకరణ (టెక్నాలజీ అడాప్షన్), బ్యాంకింగ్ రంగంలో ఉత్తమవృద్ధి (బెస్ట్ గ్రోత్ ఇన్ బిజినెస్ రేట్)లో సాధించిన ప్రగతిపై జిల్లా డీసీసీబీకి అవార్డులు లభించాయి. అవార్డులను గవర్నర్ చేతుల మీదుగా బ్యాంకు సీఈఓ శంకర్‌బాబు అందుకున్నారు.

మణిపూర్ ఘటనపై న్యాయవాదుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నెల్లూరు(లీగల్): జిల్లా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా కోర్టు ఆవరణ వద్ద మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంస్థ గౌరవ అధ్యక్షులు, బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించి ఆపై గ్యాంగ్ రేప్ చేసిన నీచమైన చర్యను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఐఏఎల్ నాయకులు అబ్బాయిరెడ్డి, బ్రహ్మం, శ్రీధర్, శివశంకర్, కోటేశ్వరరావు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను తీసుకొస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకొని అనేక మంది ఉపాధి పొందడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. అలాంటి కోవకు చెందినదే 'బీ కీపింగ్'. పంట పొలాల మధ్య తేనెటీగల పెంపకాన్నే 'బీ కీపింగ్' అంటారు.



బీ కీపింగ్

- తేనెటీగల పెంపకంతో ఆర్థికాభివృద్ధి
- మార్కెట్లో కిలో తేనె ధర రూ.350 నుంచి రూ.400
- ఔషధ గుణాలతో పాటు వ్యాధుల నివారణలోనూ ఉపయోగం
- భారీగా సబ్సిడీని అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- ఎఫ్పీఓల ఏర్పాటుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు

సాక్షి, నెల్లూరు డెస్క్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'బీ కీపింగ్' పథకానికి తోడ్పాటునందిస్తున్నాయి. తేనెటీగల పెంపక రంగాన్ని అభివృద్ధి చేయడం, పంట ఉత్పాదకతను పెంచడం, శిక్షణ ఇవ్వడం, అవగాహన కల్పించడం ఈ పథకం ఉద్దేశం. నేషనల్ బీ బోర్డు (ఎన్బీబీ) నాబార్డుతో కలిసి దేశంలో తేనెటీగల పెంపకానికి ఆర్థిక సాయాన్ని అందిస్తోంది. ఈ క్రమంలో తేనెటీగల పెంపకం వ్యాపారానికి ప్రభుత్వం 80 నుంచి 85 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది.

ఎలా ప్రారంభించాలి..

తేనెటీగల పెంపకాన్ని మొదట 10 పెట్టెలతో ప్రారంభించొచ్చు. ఒక బాక్సులో 40 కిలోల తేనె దొరికితే పది బాక్సులకు 400 కిలోలవుతుంది. మార్కెట్లో ప్రస్తుతం కిలో రూ.350 వరకు ఉంది. ఈ లెక్కన రూ.1.4 లక్షల ఆదాయం వస్తుంది. ఒక్కో పెట్టె ఏర్పాటుకు రూ.3,500 ఖర్చవుతుంది. పది పెట్టెలకు రూ.35 వేలవుతుంది. ఖర్చులు పోనూ నికర లాభం ఏడాదికి రూ.1.05 లక్షల వరకు ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు. తేనెటీగల సంఖ్య పెరుగుదలతో ఏటా ఉత్పత్తి పెరుగుతుంది.

ఎఫ్పీఓల ఏర్పాటు

'అరణ్య' బ్రాండ్ పేరుతో చిత్తూరు జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్పీఓలు) ఉత్పత్తి చేసే తేనెలో దాదాపు 25 శాతాన్ని టీటీడీ సేకరిస్తోంది. 2019 – 20లో దాదాపు 20 వేల కిలోల తేనెను ఉత్పత్తి చేయగా, ఇందులో ఐదు వేల కిలోలను టీటీడీ కొనుగోలు చేసింది. ఇప్పుడు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు మరిన్ని ఎఫ్పీఓలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని అటవీ సమీప మండలాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు గానూ ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

అవిశ్రాంత జీవి తేనెటీగ

అవిశ్రాంతంగా పనిచేసే తేనెటీగలు చెట్లు, పర్యావరణానికి చేసే ప్రయోజనాన్ని వెలకట్టలేం. 'భూమి పైనుంచి తేనెటీగలు అదృశ్యమైతే, మానవులు ఎక్కువ కాలం మనుగడ సాగించలేరు' అని ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అన్న మాటలను మనం ఎప్పటికీ మర్చిపోకూడదు. పుప్పొడిని ఒక పువ్వు నుంచి మరో పువ్వుకు చేరవేయడం ద్వారా తేనెటీగలు జీవజాతుల ఆహారోత్పత్తికి తోడ్పడటమే కాకుండా జీవ వైవిధ్యాన్ని కాపాడటంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయి.

అంతరించిపోయే జాబితాలో..

ఇటీవలి సర్వేల ప్రకారం గత రెండు దశాబ్దాల కాలంలోనే దాదాపు 90 శాతం తేనెటీగలు అంతరించిపోయాయి. ఇది అత్యంత ఆందోళన కలిగించే పరిణామం. విచక్షణారహితంగా అడవుల నరికివేత, తేనెతుట్టెలు పెట్టడానికి అనువైన వృక్షాలేకపోవడం, వివిధ పుష్పజాతులు అంతరించిపోవడం, క్రిమిసంహారక మందుల వినియోగం తేనెటీగలు అంతరించిపోవడానికి కారణమవుతున్నాయి.

వేల మైళ్ల ప్రయాణం

తేనె తయారీకి తేనెటీగలు వాటి జీవితకాలం మొత్తం కష్టపడతాయని చెప్పొచ్చు. తేనెటీగలు ఒక చెంచా తేనెను తయారు చేసేందుకు వేల కిలోమీటర్లు ఎగరాల్సి ఉంటుంది. మొత్తం జీవిత కాలంలో ఒక తేనెటీగ ఒక చెంచా తేనెను కూడా తయారు చేయలేదని పరిశోధనల్లో వెల్లడైంది. ఆడ తేనెటీగలు మాత్రమే తేనెను తయారు చేస్తాయి. మగ తేనెటీగలు ఏ పనీ చేయక ఆడ తేనెటీగలు ఎక్కువగా ఉన్న చోటే ఉంటాయి. తేనెటీగ సగటు జీవిత కాలం 45 రోజులు మాత్రమే. ఒక కిలో తేనెను తయారు చేసేందుకు తేనెటీగలు దాదాపు 40 లక్షల పువ్వుల రసాన్ని పీల్చుకొని 90 వేల మైళ్ల ప్రయాణించాల్సి ఉంటుంది. పుప్పొడిని మోసుకెళ్లేందుకు అనుగుణంగా ఆడ తేనెటీగలు ప్రత్యేక శరీర నిర్మాణాలను కలిగి ఉంటాయి.



ఒక్కో తుట్టెలో 50 వేలు

తేనెతుట్టెను సాధారణంగా ఒక రాతికిగానీ భవన పైకప్పునకు లేదా పెద్దచెట్టు కొమ్మలకు తేనెటీగలు ఏర్పాటు చేస్తాయి. ఒక్కో దానిలో 50 వేల వరకు తేనెటీగలు ఉంటాయి. ప్రతి తేనెతుట్టెలో ఒక రాణి ఈగ ఉంటుంది. ఇది రోజుకు రెండు వేల వరకు గుడ్లను పెడుతుంది. వీటి నుంచి ఒకట్రెండు రోజుల తర్వాత పిల్ల తేనెటీగలు బయటకొస్తాయి. మూడు వారాల్లో పూర్తిగా ఎదిగి బయటకొచ్చేస్తాయి.

పోషక విలువలు అధికం



తేనె ఎంతో రుచికరమైన, పోషక విలువలు గల ఆహార పదార్థం. కంటి వ్యాధులు, ఉబ్బసం, గొంతు ఇన్ఫెక్షన్లు, క్షయ, అలసట, హెపటైటిస్, మలబద్ధకం, పైల్స్ వంటి వాటిని నయం చేయడంలో తేనెను ఉపయోగిస్తారు. తేనెటీగ విషాన్ని కీళ్ల నొప్పుల చికిత్సలో ఉపయోగిస్తారు. తేనెటీగల నుంచి సేకరించే ప్రొపోలిస్ ద్రావకాన్ని హోమియోపతి మందుల తయారీలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదంలో ఎన్నో మందులను తేనెతో కలిపి ఇస్తారు.



అడవి నుంచి సేకరిస్తాం



తేనెటీగల పెంపకానికి సబ్సిడీ ఉందని తెలియదు. మేము అడవు లపైనే ఆధారపడ్డాం. ఏడాదిలో ఉండే రెండు సీజన్లలో అడవిలోకి వెళ్లి తేనెపట్టులు ఎక్కడెక్కడున్నాయో గమనిస్తాం. వీటిలో నిండుగా తేనె ఉన్నప్పుడు వెళ్లి తేనెటీగలకు ప్రాణహాని లేకుండా వాటిని తొలగించి పట్టును తీసుకొస్తాం. తేనెను వేరు చేసి సీసాల్లో నింపి మార్కెట్లో విక్రయించగా, కిలోకు రూ.350 నుంచి రూ.400 వరకు ధర లభిస్తోంది.

– వెలుగు చిన్నసుబ్బయ్య, గోనుపల్లి, రాపూరు మండలం

సేకరణ కూడా కష్టమే



మేం అడవిలోకి తేనెపట్టుల కోసం వెళ్లినప్పుడు అనేక కష్టాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. విష పురుగులు, పాములూ తారసపడతాయి. కొండలు, చెట్లు ఎక్కాల్సి ఉంటుంది. ఒక్కోసారి చెట్ల పైనుంచి కిందపడి గాయాలవుతాయి. మేము సేకరించిన తేనెకు మంచి ధర రావడంతో ఆ కష్టాలను మర్చిపోతాం. కుటుంబమంతా తేనె సేకరణలోనే ఉంటాం.

– చలమచర్ల ఈశ్వరయ్య, గోనుపల్లి, రాపూరు మండలం

ప్రభుత్వ ప్రోత్సాహం



రైతులు సంఘాలుగా ఏర్పడి తేనెటీగలు పెంచుకుంటామంటే ప్రభుత్వం సబ్సిడీతో రుణాలిస్తోంది. ఇది ఎక్కువ పెట్టుబడిలేని మంచి పథకం. పది బాక్సులతో తేనెటీగల పెంపకాన్ని చేపట్టొచ్చు. ఉత్పత్తయిన తేనెనూ ప్రభుత్వమే నిర్ణీత ధరకు కొనుగోలు చేస్తుంది. లేకపోతే మార్కెట్లోనైనా విక్రయించుకోవచ్చు. ఔత్సాహిక రైతులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.

– సుబ్బారెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి

నగర వనాలతో పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగర వనాల ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. అక్కచెరువుపాడు, పొదలకూరు రోడ్డులోని నగరవనం, అల్లీపురం, తదితర ప్రాంతాల్లోని అటవీ భూములను జిల్లా అటవీ శాఖ అధికారి చంద్రశేఖర్‌తో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం కమిషనర్ మాట్లాడారు. నగర పరిధిలో జీవవైవిధ్యాన్ని పెంపొందించేందుకు గానూ అటవీ భూముల్లో వివిధ రకాల మొక్కలను సంరక్షించేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రాంతాల్లో భూసారం, వాతావరణం, నీటి సదుపాయం, తదితరాల ఆధారంగా నాటాల్సిన మొక్కలను ఎంచుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ పరిధిలో భూసారం, భూగర్భ జలాల పరిరక్షణకు మొక్కల పెంపకాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కోరారు. జిల్లా అటవీ శాఖ నెల్లూరు రేంజర్ మాల్యాద్రి, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగ ఈఈ సంజయ్, ఉద్యానాధికారి ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లో పనుల తనిఖీ



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సౌత్ సెంట్రల్ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నామని తెలిపారు. అనంతరం మనుబోలు, గూడూరు రైల్వేస్టేషన్లను పరిశీలించారు.



చందనాలంకారంలో శ్రీవారు

- గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు

పెంచలకోన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్వామివారి స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో శాంతి హోమం, కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. సాయంత్రం బంగారు గరుడ వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి అలంకరించి ఆస్థాన సేవ నిర్వహించారు. శ్రీవారిని దర్శించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

– రాపూరు

రొట్టెల పండగకు విస్తృత ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(బృందావనం): నగరంలోని బారాషహీద్ దర్గాలో ఈ నెల 29 నుంచి ఐదు రోజుల పాటు నిర్వహించనున్న రొట్టెల పండగకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. రొట్టెల పండగ ఏర్పాట్లను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన బ్యారికేడింగ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, స్వర్ణాల చెరువు ఘాట్ల వద్ద చేపట్టిన ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు చేశారు. పారిశుధ్య ఏర్పాట్లను పక్కాగా చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. రొట్టెల పండగకు దాదాపు పది లక్షల నుంచి 15 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, ఈ తరుణంలో భారీగా పోలీస్ సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని పేర్కొన్నారు.

పార్కింగ్ ప్రాంతాల్లో పరిశీలన

తెలుగుగంగ కాలనీలోని ప్రసారభారతి కార్యాలయం, వీఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేయనున్న పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్, కమిషనర్ పరిశీలించారు. ఏఎస్పీ హిమవతి, ఆర్డీఓ మలోల, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నిర్మలాదేవి, ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థ, ఎస్పీడీసీఎల్, జలవనరుల శాఖ ఎస్ఈలు గంగాధర్, సంపత్‌కుమార్, వెంకటసుబ్బయ్య, కృష్ణమోహన్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, ఆర్టీసీ ఆర్ఎం శేషయ్య, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఘాట్‌ను పరిశీలిస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పటిష్ట ప్రణాళికతో నిర్వహణ

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గాలో నిర్వహించనున్న రొట్టెల పండగను అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో పటిష్టంగా జరిపేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రొట్టెల పండగ ఏర్పాట్లను డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం ఎంపీ మాట్లాడారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దర్గా ప్రాంగణంలో అన్ని వసతులను కల్పిస్తున్నామన్నారు. షామియానాలు, కమాండ్ కంట్రోల్ విభాగం, వీఐపీ రిసెప్షన్, సీసీ కెమెరాలు, విద్యుత్, లైటింగ్, మరుగుదొడ్లు, బారికేడ్ల ఏర్పాటు, తదితర అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామని వివరించారు. భక్తులు మొక్కులు చెల్లించుకునేలా, రొట్టెలు మార్చుకునేలా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

భారీ భద్రతకు చర్యలు

- రెండు వేల మందితో బందోబస్తు
- 10 పార్కింగ్ ప్రదేశాలు
- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



వివరాలను వెల్లడిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని బారాషహీద్ దర్గాలో ఈ నెల 29 నుంచి నిర్వహించనున్న రొట్టెల పండగకు భారీ భద్రత ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. రొట్టెల పండగ సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ఆయన వెల్లడించారు. నేరాలు జరగకుండా.. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని వివరించారు. జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన సుమారు రెండు వేల మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దర్గాలోకి వెళ్లే మార్గాల వద్ద మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి తనిఖీల అనంతరమే లోపలికి అనుమతించనున్నామని స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యార్థం దర్గా ఆవరణలో పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖలతో కలిసి మరో ఆరు అవుట్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశామని, ఇవి 24 గంటలూ పనిచేయనున్నాయని చెప్పారు. దర్గా ఆవరణ మొత్తం కవరయ్యేలా కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఏఎస్పీలు హిమవతి, ప్రసాద్, నగర, ట్రాఫిక్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, అబ్దుల్ సుభాన్, ఎస్బీ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, మిద్దె నాగేశ్వరమ్మ, ఆర్ఐ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 10.3 మిల్లీమీటర్ల వర్షపాతం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో 10.3 మిల్లీమీటర్ల వర్షపాతం బుధవారం నమోదైంది. అత్యధికంగా దగదర్తి మండలంలో 24.4, అత్యల్పంగా ఏఎస్‌పేట మండలంలో 1.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సైదాపురంలో 22.4, తోటపల్లిగూడూరులో 16.8, ఇందుకూరుపేటలో 16.4, మనుబోలులో 14.4, రాపూరులో 14.2, ముత్తుకూరులో 14, నెల్లూరు నగరం, కోవూరులో 13.2 చొప్పున, కావలిలో 13, విడవలూరులో 12.8, అల్లూరులో 12.4, బోగోలు, కలిగిరిలో 12.2 చొప్పున, కొడవలూరు, వెంకటాచలంలో 11.8 చొప్పున, జలదంకిలో 11.6, అనంతసాగరంలో 11.4, నెల్లూరు రూరల్‌లో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



నెల్లూరులో కురుస్తున్న వర్షం

అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమంపై ప్రధాన దృష్టి సారిస్తున్నానని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెరుమాళ్లపాడు సచివాలయ పరిధిలో గల పుట్టుపల్లి, కొట్టాలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్లను అందజేశారు. గ్రామంలోని శివాలయంలో పూజలు చేశారు. శతాబ్దాల చరిత్ర గల శివాలయ జీర్ణోద్ధరణ పనులు చేయించాలని గ్రామస్తులు కోరారు. ఆయా శాఖల అధికారులకు తెలిపి పనులు చేయించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. వివిధ సమస్యలను గ్రామస్తులు తెలియజేయగా, పరిష్కరించేలా చూస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి సచివాలయానికీ రూ.20 లక్షల చొప్పున అభివృద్ధి పనులకు మంజూరు కానున్నాయని, ప్రాధాన్య క్రమంలో వీటిని పూర్తి చేస్తామని వెల్లడించారు. ఎంపీపీ తూమాటి విజయ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తిరుపతినాయుడు, సొసైటీ అధ్యక్షుడు వీరరాఘవరెడ్డి, జేసీఎస్ కోఆర్డినేటర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచ్ పురుషోత్తం, ఎంపీటీసీ మస్తాన్, పార్టీ నేతలు శేఖర్, శ్రీధర్, కాలేషా, తదితరులు పాల్గొన్నారు.


సమస్యలను ఆరాతీస్తున్న విక్రమ్‌రెడ్డి

ఎంత మందికి ఉచితంగా సీట్లిచ్చారు..?

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వ నిబంధనల మేరకు 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించాలని, ఆ దిశగా టీడీపీ నేత నారాయణ తన విద్యాసంస్థల్లో ఉచితంగా ఎన్ని సీట్లు ఇచ్చారో చెప్పగలరానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ప్రశ్నించారు. నగరంలోని 8వ డివిజన్లో గల స్టోన్‌హౌస్‌పేట ముగ్గురాళ్ల వీధి, రేబాలవారి వీధి, సీఆర్పీ డొంక, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తాను అనవసరంగా విమర్శిస్తున్నానని నారాయణ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గుడిసె నుంచి వచ్చానని చెప్పారని.. ప్రతి ఒక్కరూ కష్టపడే పైకి వస్తారని తెలిపారు. 2019 విద్యా సంవత్సరానికి.. ఇప్పటికీ నారాయణ స్కూళ్లలో ఫీజులను అధికంగా పెంచారని ఆరోపించారు. నెల్లూరులో పాదయాత్ర చేసే సమయంలో నారా లోకేశ్ తనపై నింద లేస్తే, దానికి వివరణ ఇచ్చానని.. మీరు చేసిన తప్పులను ప్రశ్నిస్తే సమాధానాలు దాటేస్తారానని ప్రశ్నించారు. ప్రజలు, టీడీపీ నేతలు, కార్యకర్తలను నాలుగున్నరేళ్లు మర్చిపోయిన నారాయణ 2024 ఎన్నికలకు సిద్ధమయ్యారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి పెంచలరెడ్డి, కార్పొరేటర్ మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఘాట్‌రోడ్డుకు త్వరలో అటవీ అనుమతులు

• వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి – బండగానిపల్లి మార్గంలో మూడు కిలోమీటర్ల మేర ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అటవీ అనుమతులు త్వరలో మంజూరు కానున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, జిల్లా అటవీ శాఖ అధికారితో బుధవారం చర్చించారు. ఘాట్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అటవీ అనుమతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలో క్లియరెన్స్ వస్తుందని వారు చెప్పారని రాజారెడ్డి తెలిపారు. అనుమతులొచ్చిన వెంటనే అసంపూర్తిగా ఉన్న మూడు కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు నిర్మాణాన్ని చేపడతామని చెప్పారు.


జేసీ కూర్మనాథ్‌ను కలిసిన రాజారెడ్డి, తనయుడు అభినయ్‌రెడ్డి

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వెంకటగిరి: ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 11వ వార్డు పరిధిలోని రాణిపేటలో రెండో రోజు జోరువానను సైతం లెక్క చేయకుండా ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలు లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేస్తున్న ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని తెలియజేశారు. సంక్షేమాభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వార్డు కౌన్సిలర్ టి సుకన్య, వహీదా, ఎస్ గోపాలకృష్ణ, ఎం జానకిరామయ్య, సొసైటీ అధ్యక్షుడు పి దశరథరామిరెడ్డి, నాయకులు రొంటాల చిన్నా, యస్దానీ బాషా, సోమశేఖర్ పాల్గొన్నారు.


బుక్‌లెట్ అందించి సమస్యలను తెలుసుకుంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం..

స్థానిక నేదురుమల్లి నివాసంలో మున్సిపల్ కౌన్సిలర్‌లతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో డ్రైన్‌లు, సీసీ రోడ్ల నిర్మాణం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే సచివాలయాలకు రూ.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, ప్రాధాన్య క్రమంలో పనులను గుర్తించాలని సూచించారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండగగా గుర్తిస్తామని సీఎం ప్రకటించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఇంకా సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు కృషిచేసిన కౌన్సిలర్‌లకు అభినందనలు తెలియజేశారు. తొలుత పట్టణ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్‌లు, ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి షంషాద్ బేగం నియామక పత్రాలను అందజేశారు.

వెంగమాంబ ఆలయ హుండీ కానుకల లెక్కింపు



దుత్తలూరు: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థాన హుండీ కానుకలను బుధవారం దేవదాయశాఖ అధికారులు దేవస్థాన ఆవరణలో లెక్కించారు. గత నెల 16వ తేదీ నుంచి బుధవారం వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన నగదు కానుకలు లెక్కించగా రూ.29,39,105 ఆదాయం వచ్చినట్లు ఈఓ వి.ఉషశ్రీ తెలిపారు. ఆలయ ప్రధాన వ్యవస్థాపక ధర్మకర్త పచ్చవ వెంకటేశ్వర్లు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధీర్‌కుమార్, రిటైర్డ్ స్టేట్‌బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ బృందం, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

నెల్‌కాస్ట్‌లో కార్మికులకు శిక్షణ



నెల్లూరు(సెంట్రల్): పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో గూడూరులోని నెల్‌కాస్ట్ పరిశ్రమలో పరిశ్రమల్లో వర్క్‌పర్మిట్ సిస్టంపై బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్రకుమార్ తెలిపారు. వివిధ పరిశ్రమల నుంచి దాదాపు 79 మంది కార్మికులు శిక్షణలో పాల్గొన్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో అధికారులు అనిల్‌కుమార్, విన్సెంట్ పాల్, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు @ రూ.160 కోట్లు

ఆత్మకూరు రూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో ఈ పంట కాలంలో రూ.160 కోట్లకు పైగా విలువైన పొగాకును కొనుగోలు చేశామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. 77,78,365 కిలోల పొగాకును ఈ మొత్తానికి కొనుగోలు చేశామని వివరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.255 ఈ ఏడాది పలికిందని తెలిపారు. అత్యల్ప ధర రూ.150, సగటు ధర రూ.205.77గా నమోదైందన్నారు. కాగా దుత్తలూరు క్లస్టర్ రైతుల నుంచి 948 బేళ్లను కొనుగోలు చేయగా, మరో 19 బేళ్లను వివిధ కారణాలతో వేలం నుంచి తిరస్కరించామని చెప్పారు. ఈ క్లస్టర్ రైతుల వద్ద కొనుగోలు చేసిన బేళ్లకు రూ.2,85,46,112 మేర అందిందని తెలిపారు.


కొనుగోలు చేసిన బేళ్లు

బుచ్చిరెడ్డిపాళెంలో భారీ చోరీ

• తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలు, అర కిలో వెండి వస్తువుల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు చోరీకి పాల్పడిన ఘటన బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు.. అంబేడ్కర్‌నగర్‌లో అందె రాజేశ్వరి నివాసం ఉంటున్నారు. నగర పంచాయతీ కౌన్సిలర్రై నెల్లూరులో ఉంటున్న తన కుమార్తె అందె ప్రత్యూష ఇంటికి పది రోజుల క్రితం ఆమె వెళ్లారు. ఈ క్రమంలో ఇంటికి బుధవారం ఆమె చేరుకున్నారు. ప్రధాన తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గమనించిన ఆమె ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా ఉండటంతో పాటు బీరువా తలుపులను సైతం పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. బీరువాలో తొమ్మిది సవర్ల బంగారు ఆభరణాలతో పాటు దాదాపు అర కిలో వెండి వస్తువులు, రూ.ఐదు వేలు చోరీకి గురయ్యాయని నిర్ధారించుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. ఇంట్లో క్లూస్‌టీమ్ పరిశీలించింది. బుచ్చిరెడ్డిపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


బాధితురాలిని విచారిస్తున్న వీరప్రతాప్

అరబిందో ఫార్మాకు 12 మంది ఎంపిక

నాయుడుపేట: నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ ఆధ్వర్యంలో అరబిందో ఫార్మా కంపెనీలో పనిచేసేందుకు బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, మేనకూరు కంపెనీల్లో పనిచేసేందుకు నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 12 మంది ఎంపికయ్యారు. జాబ్‌మేళాలో జేకేసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఆర్ వాసప్ప, ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌వర్మ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 124
లేయర్ (లైవ్)	: 88
బ్రాయిలర్ చికెన్	: 216
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 150

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.37
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7

26 మద్యం సీసాల స్వాధీనం

సంగం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై దాడులను పోలీసులు బుధవారం చేపట్టారు. అక్రమంగా విక్రయిస్తున్న 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడు దశయ్యపై కేసు నమోదు చేశామని ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.

కూలిన విద్యుత్ స్తంభం

వరికుంటపాడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని విద్యుత్ స్తంభం బుధవారం ఉదయం కూలింది. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ స్తంభం శిథిలావస్థకు చేరుకుంది. ఈ క్రమంలో స్తంభం పడిపోవడంతో స్థానికులు గమనించి విద్యుత్ సిబ్బందికి తెలియజేశారు. దీంతో వారు వెంటనే స్పందించి సరఫరాను నిలిపేశారు. స్తంభం కూలిన సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. అనంతరం కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

అక్టోబర్ ఐదు వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ అక్టోబర్ ఐదు వరకు కొనసాగనుందని డీఈఓ గంగాభవానీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అభ్యాసకులకు పాఠ్యపుస్తకాలు, మార్కుల మెమోలు, పాస్ సర్టిఫికెట్లను వారి చిరునామాకు పంపనున్నామని చెప్పారు. అడ్మిషన్లకు గానూ apopenschool.ap.gov.inను సంప్రదించాలని సూచించారు.